అన్నట్టుగా చూశాడు.

ఆమె నిలబడే ఉంది.

ఆమె చెప్పడం మొదలుపెట్టింది. "స్టోర్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న సలీమ్ భార్యను సార్!" పరిచయం చేసుకుంటున్నట్టు అంది.

"ఊఁ."

క్షణం ఆలోచిస్తున్నట్టు ఉండిపోయి, "మీరో సహాయం చేయాలి, సార్!" అంది. విషయం ఎలా చెప్పాలో తెలియక తికమకపడుతోంది ఆమె.

అసహనంగా ఆమెవైపు చూశాడు మనోహరరావు.

"సలీమ్‌తో ఈమధ్య రోజూ గొడవ జరుగుతోంది, సార్!"

ఏ విషయం చెబుతోందో అర్థం కాలేదు.

"నేనూ, సలీమ్ కాక, మా ఇంట్లో ఆయన జీతంమీద ఆధారపడ్డవాళ్లు ఆరుగురు ఉన్నారు ... నలుగురు పిల్లలు... అత్తా, ఆడబిడ్డా మా దగ్గరే ఉంటారు."

కాలం వేస్ట్ అయిపోతోందన్న బాధ మనసులో కలుగుతున్నా, ఆమె స్వరంలోని ఆర్ద్రత, ముస్లిమ్ అయినా ఆ భాషలోని రమ్యత మనోహరరావుని ఆమె మాటలు వినేలా చేస్తున్నాయి.

"వచ్చే తక్కువ జీతంతో కుటుంబం గడవాలి..." అని క్షణం ఆగి, "సలీమ్‌కి ఇంటి పనులేవీ పట్టవు. కేవలం రాత్రికి ఎక్కడో అక్కడ నిద్రపోవాలి కనుక ఇంటికి వస్తాడు. అదీ బాగా రాత్రి అయ్యాక. వచ్చిన డబ్బంతా తాగుడికి ఖర్చుపెడతాడు. రోజూ ఆఫీసునుండి కల్లుకాంపౌండ్‌కి వెళ్లిపోతాడు. ఒళ్లు గుల్లవుతుందని ఎన్నిసార్లు చెప్పినా వినడు. ఏమైనా అంటే రాత్రంతా గొడవ చేస్తాడు. పిల్లల్నీ, నన్నూ కొడతాడు. ఈమధ్య మరీ ఎక్కువయిపోయింది. ఒక్కోసారి మరీ రాక్షసంగా ప్రవర్తిస్తున్నాడు ...!" అతికష్టమ్మీద కన్నీటిని ఆపుకుంది.

మనోహరరావు ఏమీ మాట్లాడలేదు.

ఆమే కొనసాగించింది - "ఫస్ట్ తారీఖు వచ్చి వారం కాలేదు. ఈ నెల ఒక్క పైసా ఇంట్లో ఇవ్వలేదు. నిన్న రాత్రి పెద్ద గొడవ అయింది ...!" కళ్లు తుడుచుకుంటూ అంది - "మీరే రక్షించాలి, సార్!"

క్షణం ఏమి మాట్లాడాలో తోచలేదు. మనోహరరావు మెల్లగా, "ఏం చేయమంటావు నన్ను?"

"ఈ ఆఫీసులో అడిగితే చెప్పారు, మీరే జీతాల బిల్లు వేస్తారని. నా ప్రయత్నంలో మీరే సహాయం చేయాలి!" అర్థిస్తున్నట్టుగా అడిగింది.

"చెప్పు."

"ఈ నెల ఎలాగోలా గడిపేస్తాము. ఇకనుండి ప్రతి నెలా ఫస్టుతారీఖున వస్తాను. నేను వచ్చేంతవరకు అతనికి జీతం ఇవ్వకండి. నేను వచ్చాక ఇస్తే, ఏదో తంటాలు పడతాను!" అంది బాధగా.

కొంతసేపు గాఢమైన నిశ్శబ్దం ఇద్దరిమధ్య.

"ఓకే! నేను ఏర్పాటు చేస్తాను!" గంభీరంగా అన్నాడు మనోహర్‌రావు.

ఏమైనా ఇబ్బందులు వస్తాయనుకున్న ఆమె, మనోహరరావు అడిగిన వెంటనే తథాస్తు దేవతలా వరం ఇచ్చేసరికి, కాస్త ఆనందంతో మరొకసారి కృతజ్ఞతలు చెప్పుకుని, దండాలు పెట్టి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన వెంటనే మనోహరరావులో బాధ మొదలయింది.

గుండెల్లో మంట ...

గడియారంవైపు చూశాడు.

అయిదయింది.

ఆమె వెళ్లిపోయాక ఏదో అశాంతి అలుముకుంది. కూలర్ ఆన్‌లో ఉన్నా నుదుట చెమట పట్టింది. అసహనంగా సీట్లోంచి లేచాడు. ఎదురుగా ఉన్న అద్దంలో తన బొమ్మ తనకి కనిపిస్తోంది - కుడి ఎడమల తారుమారుతో.

సలీమ్ ... భార్య ... పిల్లలు ...

తనూ ... భార్య .... పిల్లలు ...

రోజూ ఆలస్యమవుతూంటే బాణాల్లాంటి భార్య చూపులు ... బయటికి అరుపులు, కేకలు ఉండకపోయినా, హృదయంలో అల్లకల్లోలం ...

ఎంతోకాలంగా అన్యోన్యంగా ఉండే భార్య, పిల్లలు తన నుండి దూరంగా వెళ్లిపోవడం గుర్తొచ్చింది. వెలివేసినట్టు చూసిన చూపులు గుండె లోతుల్ని తాకాయి!

• • •

సాయంత్రం ఆరవుతోంది.

గత కొద్దికాలంగా నగరంలోని రకరకాల బార్‌లకేసి పరుగులెత్తిన మనోహరరావు కారు చాలారోజుల తర్వాత అతని ఇంటివైపు సాగిపోయింది!

■



## వీరు పెళ్లివారమండీ

దాసరి అరుణ్‌కుమార్ దశ తిరిగింది. తండ్రి దీవెనలతోబాటు ప్రేక్షకుల ఆదరణ కూడా 'గ్రీకువీరుడు'లో సంపాదించుకో గలిగాడు. క్రమంగా కాలు నిలదొక్కుకోగల శక్తి సంతరించుకుంటున్నాడు. ఆప్తులు అభినందన ఆశీస్సులందిస్తున్నారు. ఆ పిక్చర్ నాంది అయింది. వెంటనే రాబోతున్న రెండో చిత్రం 'పెళ్లివారండి' విడుదలకు ముస్తుబు చేసుకుంటోంది.

విజేతా ఫిలిమ్స్ బేనర్‌పై రూపొందిన ఈ చిత్రానికి దర్శకుడు వీరు కె.అరుణ్‌కుమార్ సరసన సాక్షి శివానంద్ నటించింది. 'లెఫ్ట్ చూస్తే రమ్యకృష్ణ రైట్ చూస్తే రంభ, మధ్య ఉన్నదెవరు మధుబాల' అంటూ భువనచంద్ర ఓ సరదా సరసాల డ్యూయెట్ రాశాడు. దానిని ముఖ్యజంటపై చిత్రీకరించారు.

ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, చలపతిరావు, శివాజీరాజా, ఏ.వి.ఎస్. ఆలీ, భరణి, బాబూమోహన్, ఎం.ఎస్.నారాయణ, రాళ్లపల్లి, వై. విజయ, శ్రీలక్ష్మి, శివపార్వతి, మరొక ప్రధాన పాత్రలో సత్యనారాయణ నటించారు.మరుధూరి రాజా మాటలు, జయరాం కెమెరా, గౌతంరాజు కూర్పు నిర్వహించారు. నిర్మాతలు : వి. జయశ్రీ, ప్రకాశ్. దర్శకుడు : వీరు కె.